ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- భారత న్యాయవ్యవస్థ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విలువలను పటిష్టపరుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- రాష్ట్రంలోని తొలి దశ గ్రామ పంచాయతీలతో సహా 4 నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

- కాకినాడ జిల్లాకు చెందిన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు.

==========

భారత న్యాయవ్యవస్థ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విలువలను పటిష్టపరుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలో సుప్రీంకోర్టు నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి ఈరోజు మాట్లాడుతూ... గత ఏడెనిమిది దశాబ్దాల్లో సాంకేతికత, మీడియా ప్రభావం పెరిగిందని, సంస్థల పనితీరులో భారతీయత ప్రతిబింబించాలని, వలసవాద మనస్తత్వం నుంచి బయటపడాలని పేర్కొన్నారు. సకాలంలో న్యాయం అందించడం అనేది న్యాయ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగమనీ రాష్ట్రపతి తెలిపారు. శిక్షకు బదులు న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ.. సత్వర న్యాయం కోసం భారతీయ న్యాయ సంహిత చట్టం అమలును బలోపేతం చేస్తుందని ద్రౌపది ముర్ము వివరిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

==========

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో రాష్ట్రంలో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఈరోజు చెన్నైకు చెందిన దంపతులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 121 కిలోల బంగారు ఆభరణాలను సమర్పించారు. అనంతరం వారితో కలిసి తిరుమలలో ముఖ్యమంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వర స్వామికి భారీ ఎత్తున విరాళం సమర్పించిన దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. దేవునిపై భక్తి ఉన్న ప్రతి ఒక్కరూ `మానవ సేవే - మాధవ సేవ` అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. భక్తులు సమర్పించే ప్రతి రూపాయిని టీటీడీ భక్తుల సౌకర్యాలు, సేవలకే ఖర్చు చేస్తోందన్నారు. దేశంలోని అన్ని రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయం ఉన్న ప్రతిచోటా అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, `ప్రాణదానం` ద్వారా వైద్య సేవలు, `విద్యాదానం` ద్వారా ప్రత్యేక నిధితో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎల్ నినో వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా `వృక్షో గోవిందం` పేరుతో పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపడతామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

రాష్ట్రంలో తొలి దశ గ్రామ పంచాయతీలతో సహా 4 నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈరోజు ముగిసింది. ఇప్పటికే పలు పంచాయతీలలో ఫలితాలు వెల్లడి కాగా.. మిగిలిన వాటికి లెక్కింపు కొనసాగుతోంది. 23 పట్టణ స్థానిక సంస్థల్లో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. మేయర్ స్థానాలకు 36, చైర్పర్సన్ స్థానాలకు 134 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీటికి ఈనెల 30న లెక్కింపు జరగనుంది.

విరామం

==========

కాకినాడ జిల్లా సుబ్బంపేటకు చెందిన గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోటు ప్రస్తుతం బంగారంపాలెం వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారని, మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. మత్స్యకారులు చేపల వేట కోసం డీప్ సీ ప్రాంతానికి వెళ్లడంతో మొబైల్ సిగ్నల్ అందుబాటులో లేక సమాచార సంబంధాలు నిలిచిపోయాయని వివరించారు. చేపల వేట ముగించుకుని సిగ్నల్ పరిధిలోకి వచ్చిన వెంటనే అధికారులను సంప్రదించి తాము క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందించారని తెలిపారు. ఈరోజు రాత్రికి కాకినాడ తీరానికి బోటు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. మత్స్యకారులకు ప్రభుత్వ అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

==========

గోవాలో జరుగుతున్న 57వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (IFFI)లో భాగంగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ సభ్య సంబంధాలు, అవార్డుల పరిపాలన ఉపాధ్యక్షురాలు నటాలీ వేడ్ ఈరోజు పనాజీలోని కళా అకాడమీలో `డీకోడింగ్ అకాడమీ అవార్డ్స్` అనే శీర్షికతో ఒక మాస్టర్ క్లాస్‌ను నిర్వహించారు. ఈ మాస్టర్‌క్లాస్.. ఆస్కార్ అవార్డు సంస్థలు ఎలా పని చేస్తాయి, ఈ ప్రతిష్టాత్మక అవార్డుల కోసం చిత్రాలను ఎలా పరిగణిస్తారనే దానిపై అవగాహనను అందించింది. అర్హత, నియమాలు, సమర్పణ ప్రక్రియ, ఓటింగ్ విధానం, అవార్డులను నిర్వహించడంలో వాటి ప్రమాణాలను కాపాడటంలో అకాడమీ పాత్ర గురించి నటాలీ వేడ్ తెలియజేశారు. ఉత్తమ చిత్రం, లఘు చిత్రం, అంతర్జాతీయ చలనచిత్రం విభాగాలతో సహా, ఆస్కార్ పరిశీలనకు సినిమాలు అర్హత సాధించే వివిధ మార్గాలను ఆమె వివరించారు. చలనచిత్ర నిర్మాణ సాంకేతికత, ఆవిష్కరణలకు చేసిన కృషికి గాను వ్యక్తులను, సంస్థలను గౌరవించే శాస్త్రీయ, సాంకేతిక అవార్డుల గురించి కూడా చర్చించారు. ప్రపంచ చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖ నిపుణుల అనుభవాలను, అవకాశాలను చలనచిత్ర నిర్మాతలకు, విద్యార్థులకు, సినిమా ప్రియులకు అందించాలనే IFFI ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశం జరిగింది.

==========

రేపు నెల్లూరు, కర్నూలు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సమయంలో చెట్ల కింద నిలబడరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

==========

రాజ్యాంగం ద్వారానే దేశానికి గుర్తింపు లభిస్తుందని మాజీ న్యాయమూర్తి మాకిన శ్రీనివాసరావు అన్నారు. 77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణంలోని ఏవీఎన్ కళాశాలలో ఈరోజు నిర్వహించిన `మేరా యువ భారత్` కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగం ఎంత పటిష్టంగా ఉంటే.. ఆ దేశం అంత గొప్పగా ఉంటుందని పేర్కొన్నారు. రాజ్యాంగమే దేశానికి శక్తి అని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగం పౌరుల హక్కులను, దేశాన్ని కాపాడుతుందని చెప్పారు. 2017వ సంవత్సరం నుండి భారత ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవాన్ని పాటిస్తోందని శ్రీనివాసరావు తెలియజేశారు.

==========

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 938 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 390 పాయింట్ల లాభంతో 84 వేల 328 వద్ద ముగిసింది. నిఫ్టీ 65 పాయింట్లు లాభపడి 25 వేల 884 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 92 రూపాయల 44 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.13 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3 వేల 561 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==========

డిసెంబర్ నెల పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేసిందని విశాఖపట్టణం డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లో ఉన్న నేపథ్యంలో అధికారులు నిబంధనలు పాటించాలని సెర్ప్ విభాగ సీఈవో వి. కరుణ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. ఈ నెల 30న అధీకృత సిబ్బంది పెన్షన్ నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీల్లో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారని లక్ష్మీపతి తెలిపారు.

==========
==========